ఆరాధన

అమృతవాక్కులు

- గొప్ప త్యాగాలు చేయగలిగినప్పుడే గొప్ప పనులు చేయగలం. మన వైఖరి సవరించుకోవటం ద్వారా జీవితాన్ని మెరుగుపరుచుకోవచ్చు.
- కండ బలం, బుద్ధి బలం రెండూ గొప్పవే. కానీ ప్రపంచంపై ఆత్మశక్తి చూపే ప్రభావం ఇంకా గొప్పది.
- నీ ఆశయ సాధనలో వెయ్యిసార్లు విఫలం చెందినా ప్రయత్నం విరమించకు.

– స్వామి వివేకానంద

సూర్య

గురు పుష్కరం

బృహస్పతి జ్ఞానానికి ప్రతీక. ఆ గురుడు 12 రాశులలోను అనగా బృహస్పతి అనే శుభగ్రహం మేషాది పన్నెండు రాశులలోనూ ప్రవేశించినపుడు మనకు 12 నదుల పుష్కరాలు వస్తాయని పెద్దలు నిర్ణయించారు. అసలు 12వ సంఖ్యకి ప్రాధాన్యం చాలా ఎక్కువ. మహాభారతంలో 12 సంవత్సరాల అరణ్యవాసం, 1 సంవత్సరం అజ్ఞాత వాసం నిర్ణయించడానికి కారణం– కైకేయి 14 సంవత్సరాల అరణ్య వాసం కోరడానికి కారణం గమనిస్తే... 12 రాశులలోను 'గురుని' సంచారం పూర్తయ్యే వరకూ ఏ భార్యలు ఉంటే వారికే చెందుతుందని. అనగా ఆ రాజ్యం ఎవరు అనుభవిస్తూ ఉంటే ఆ రాజ్యం వారికే చెందుతుందనే భావనతోనే!

'పవిత్రం అనే భావనతో ఆయా నదీ పుష్కరాలలో పుష్కరుడు సకల తీర్థాల లోనూ కలిసి వచ్చి ఆ నదీ జలాలలో ఉంటారు.' అనగా గురుని రాశికి ఉన్న ప్రభావం అది. చాలామంది దృష్టిలో సాధారణంగా ఏ నదికి పుష్కరాలు వస్తే ఆ నది పరిసర ప్రాంతాలలో శుభకార్యాలు జరపరాదని. కానీ అది నిజం కాదు. ఆ విషయంలో చిన్న వివరణ:

గురుడు సింహరాశి, మకరరాశిలలో ప్రవేశించినపుడు వివాహాది శుభకార్యాలను ఏ ప్రాంతం వారు కూడా చెయ్యరాదు! గురుడు పన్నెండు నదులలో ప్రవేశించటం దానివల్ల పన్నెండు నదులకు వచ్చే పుష్కరాలను గమనిస్తే...

మేష రాశిలో గురు ప్రవేశం వల్ల 'గంగా నది' పుష్కరాలు
వృషభ రాశిలో ప్రవేశిస్తే 'రేవా నది' పుష్కరాలు
మిథున రాశిలో ప్రవేశిస్తే 'సరస్వతీ నది' పుష్కరాలు
కర్కాటక రాశిలో ప్రవేశిస్తే 'యమునా నది' పుష్కరాలు
సింహ రాశిలో ప్రవేశిస్తే 'గోదావరి' పుష్కరాలు
కన్యా రాశిలో ప్రవేశిస్తే 'కృష్ణా నది' పుష్కరాలు
తులారాశిలో ప్రవేశిస్తే 'కావేరి నది' పుష్కరాలు
వృశ్చిక రాశిలో ప్రవేశిస్తే 'భీమరథీ నది' పుష్కరాలు
ధనస్సు రాశిలో ప్రవేశిస్తే 'పుష్కరవాహిని' పుష్కరాలు
మకర రాశిలో ప్రవేశిస్తే 'తుంగభద్ర నది' పుష్కరాలు
కుంభ రాశిలో ప్రవేశిస్తే 'సింధు నది' పుష్కరాలు
మీన రాశిలో ప్రవేశిస్తే 'ప్రణీత నది' పుష్కరాలు.

అంటే గురుడు మేష రాశిలో ప్రవేశించిన కాలంలో మనకి 'గంగా నది' పుష్కరాలు వస్తాయి. మళ్ళీ మనకి తిరిగి గంగానది పుష్కరాలు రావాలంటే 12 సంవత్సరాలు పూర్తి అయితే తప్పరాదు అని అర్థం.

అయితే పుష్కర కాలం ఎంతో విలువైనది. ఆ సమయంలో సకల తీర్థాల లోనూ కలిసి వచ్చి పుష్కరుడు ఏ నదికి పుష్కరాలో ఆ నదియందు ఉంటాడు కనుక. ఆ సమయంలో ఎంతో ప్రాధాన్యం ఆ నదికి ఆ సంవత్సరమంతా ఉంటుంది. పెద్దలను, పితృదేవతలను తలచుకొని ఆ పన్నెండు రోజుల లోనూ చేసే దానాలు కూడా ఉంటాయి.

ఈ సంవత్సరం వైశాఖ శుద్ధ పంచమి, 8.5.2011 తేదీ అంటే ఆదివారం పగలు 2.14 నిమిషాలకు గంగానదికి పుష్కర ప్రారంభం. అప్పటి నుంచి పన్నెండు రోజులు పుష్కర దినములుగా అవుతాయి.

పుష్కరము అంటే పుణ్యకాలము. సూర్యోదయ కాలం నుండి మధ్యాహ్నంలోగా పుష్కర నదిలో స్నానం చేసి బ్రాహ్మణులకు యథాశక్తి దానాలు చేయుట మంచిది. ఈ పుష్కర దినములు 12 రోజులలో నదీ స్నానం చేయలేనివారు, పుష్కర దినములు గడచిన పిమ్మట మధ్యాహ్న కాలమందు రెండు ఘడియలలో స్నానం చేసి దానము చేస్తే పుష్కర స్నాన ఫలం లభిస్తుంది.

అయితే ఇప్పుడు గంగానదికి (బృహస్పతి మేషరాశిలో ప్రవేశం) పుష్కరాలు మొదలు అవుతాయి. కనుక మేషరాశిలో గురు గ్రహ ప్రవేశం మే 8వ తేదీ నుంచి కనుక ఈ సంవత్సరం పన్నెండు రాశుల వారికి గురు సంచారము వలన ప్రత్యేక ఫలితాలు ఎలా ఉంటాయి అన్నది చాలా ఆసక్తికరమైన అంశం. సాధారణంగా నవగ్రహాలు, ద్వాదశ రాశుల సంచారాన్ని బట్టి గోచార రీత్యా వ్యక్తుల యొక్క జీవితంలో చాలా రకాలైన మార్పులు మనం చూస్తుంటాం. అంటే కొన్ని గ్రహాలు సంచారం చేసే కాలాన్ని ఒక్కోరకంగా చెప్పవచ్చు. ముఖ్యంగా చంద్రుడు లాంటి గ్రహం ఒక్కోరాశిలో 2 1/2 రోజులు ఉంటే రాహు, కేతు, శని, గురు గ్రహాలు ఎక్కువ కాలం రాశిలో ఉంటాయి. శనికి 2 1/2 సంవత్సరాలు, రాహు, కేతువులకు దాదాపు 1 1/2సంవత్సర కాలం అయితే దాన్ని మార్చటానికి పట్టే సమయం, శుభుడైన గురుగ్రహానికి సరిగ్గా 'సంవత్సరం' కాలం పడుతుంది రాశి మారటానికి. ఆ రాశి మారటమే నదులకు పుష్కరం రావటం అనవచ్చు!

మేషాది ద్వాదశ రాశులకు గురుగ్రహ సంచారం వలన జరిగే శుభాశుభ ఫలితాలను కొంచెం క్లుప్తంగా తెలుసుకుందాం.

మేషరాశి వారికి జన్మ గురుడు అవ్వటం వలన (1వ స్థానంలో) అధికారులతో ఇబ్బందులు. వృత్తిలో ఆటంకాలు, చిరాకులు, మానసిక ఆందోళన, సహ ఉద్యోగులతో అకారణ వైరాలు. తద్వారా గౌరవ, మర్యాదలకు భంగం. అనుకోని భయం, ధన నష్టం ఉండే అవకాశాలున్నాయి.

పరిహారం: 'శ్రీరాజ మాంతగ్యైనమః' అనే మంత్రాన్ని ఎంత ఎక్కువగా పఠిస్తే అంత మంచిది. ప్రతి శనివారం కూడా దత్తాత్రేయుని గుడికి గాని సాయిబాబా మందిరానికి గాని వెళ్లవచ్చు.

వృషభరాశి వారికి వ్యయ స్థానంలో గురు సంచారం ఉండడం వల్ల శుభకార్యాలు, పుణ్యక్షేత్ర సందర్శనార్థం ధనవ్యయ సూచనలు. వృత్తిరీత్యా స్థానచలనం. విదేశీ యానం వ్యయప్రయాసలతో ఉంటుంది. తలచిన సమయానికి డబ్బు అమరటంలో ఇబ్బంది ఉండవచ్చు. క్రయ విక్రయాలలో నష్టం సూచన.

పరిహారం: 'సుమంతో సుమంతో శ్రీకార్తవీర్యార్జునమః' అన్న మంత్రాన్ని పఠించాలి. ఎంత ఎక్కువ పఠిస్తే అంత మేలు. ధనానికి ఇబ్బంది ఉండదు.

మిథున రాశి వారికి లాభస్థ గురుని వల్ల గౌరవ మర్యాదలు పెరుగును. సంపూర్ణ ఆరోగ్యం, ప్రతి పనిలో విజయంతో పాటుగా లాభం, మానసిక సంతోషం! శత్రువుల వల్ల బాధ తగ్గుతుంది. భగవంతునికి సంబంధించిన కార్యక్రమాలలో అధిక సంతృప్తి, ఆనందం పొందుతారు. ఆశించిన పనులు ఆలస్యం అవ్వకుండా సాగుతాయి.

మిథున రాశి వారికి అర్ధాష్టమ శని అయినా కూడా మే 8 తర్వాత గురుని ప్రభావం వల్ల బాగుంటుంది.

కర్కాటక రాశి వారికి గురుడు రాజ్య సంచారం (10వ స్థానం) వలన వృత్తిలో మార్పులు, ధన వ్యయం, నష్టం సూచన. అనుకోని ఖర్చులు, అనుకోని అనవసర ప్రయాణాలు, బంధుమిత్రులతో వైరము. తెలీని ఆందోళన, అధికారుల నుంచి ఇబ్బంది. ఏదో నైరాశ్యం ఉండే సూచన.

పరిహారం: ప్రతి గురువారం సాయిబాబా మందిరానికి వెళ్ళటం, పచ్చని అరటి పండ్లు ఆవులకి తినిపించడం అవసరం. 'శ్రీరాజ మాతంగ్యైనమ:' పఠించుట చాలా మేలు.

సింహరాశి వారికి గురు గ్రహం భాగ్యస్థాన (9) సంచారం వలన నూతన, వస్తు, వస్త్ర, గృహ లాభం ఉంటుంది. తీర్థ యాత్రలుండును. బంధువులు, మిత్రులతో కలిసి సంతోషంగా ఉంటారు. అసలు ఊహించని వైపుల నుంచి ధనరాబడి, కావలసిన సమయాలలో చేతికి ధనం సమకూరటం, వివాహాది శుభకార్యాలు జరుగును.

పరిహారం: 'శ్రీరామ జయరామ జయ జయ రామ' పఠించుట వలన పుణ్యబలం ఇంకా పెరిగి కార్యాలు సాధిస్తారు.

కన్యారాశి వారికి గురు గ్రహం అష్టమ సంచారం (8వ ఇల్లు ఆరోగ్యం) వల్ల అనారోగ్యం సూచన (ఏలిన నాటి శని కూడా కనుక). కోపం ఎక్కువై ఇతరులను దూషించటం, దొంగల వలన, అధికారులతోనూ భయం. ఏదో తెలియని భయం. ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్త అవసరం.

పరిహారం: 'క్రీం అచ్యుతానంత గోవింద' (1108సార్లు) పఠించాలి. అలాగే గురు జపం, దేవాలయ సందర్శన అవసరం.

తులారాశి ఈ రాశివారికి గురుడు సప్తమ స్థాన (7వ ఇంట్లో) సంచారం వలన నూతన వ్యక్తుల పరిచయాలు, మానసికారోగ్యం ఉంటుంది. అధికారుల మన్నన ఉంటుంది. అందమైన వస్తువుల కోసం బాగా ఖర్చు పెడతారు. అనుకున్న సమయంలో అనుకున్న పనులు చక్కగా నిర్వర్తించగలరు.



వృశ్చిక రాశి వారికి గురుడు షష్టమ (6వ) స్థాన సంచారం వలన ప్రతి చోటా అంటే కుటుంబంలోను, బంధువులతోను, మిత్రులతోను పోట్లాటలు జరిగే సూచన. ద్వేష భారం పెరిగేందుకు అవకాశం. దొంగల భయం. ధన నష్టం మొదలైన చికాకులు ఇబ్బందులు ఉంటాయి.

పరిహారం: 'శ్రీరాజ మాతంగ్యైనమః' (1108) సార్లు పఠించాలి. ప్రతి వారం గురు సంబంధిత దేవాలయాలు సందర్శించుట మంచిది.

ధనుస్సు రాశి వారికి గురుడు పంచమ (5)వ రాశి సంచారం. దీని వలన స్థిరాస్థులు కలిసి వచ్చును. ధన లాభం కలుగును. అనుకున్న పనులు అనుకున్న విధంగా జరిగిపోతాయి. శుభకార్యాలు నెరవేరును. అన్ని చోట్ల (బంధు, మిత్రులతో కూడా) ఆనందకరమైన వాతావరణం ఉంటుంది. వివాహాలు జరిగే సూచనలున్నాయి.

పరిహారం: 'దేవేంద్రాణి నమస్తుభ్యం దేవేంద్ర ప్రియభాషిణి వివాహం భాగ్యమారోగ్యం పుత్రలాభంచ దేహిమే॥ అన్న శ్లోకాన్ని (1108) సార్లు వివాహ సిద్ధి కోసం పఠించాలి.

మకర రాశి: ఈ రాశివారికి గురుడు చతుర్థ స్థానంలో (నాలుగవ ఇంట్లో) సంచారం వలన కొన్ని రకాల ఇబ్బందులను అప్రయత్నంగా ఎదుర్కొనవలసి వస్తుంది. అనుకోని విధంగా డబ్బులు ఖర్చు, మానసిక శారీరక ఇబ్బంది, ఆందోళనలు. కావలసిన వారు, అనుకూలమైన వారితో విరోధం ఏర్పడవచ్చు. అప్పు చేసే పరిస్థితి కూడా ఎదుర్కొనవలసి ఉంటుంది. అన్ని పనులలో అనుకోని ఆటంకాలు ఏర్పడే సూచన.

పరిహారం: 'సుమంతో సుమంతో శ్రీకార్త వీర్యార్జునాయనమః' అన్న మంత్రాన్ని (1108) సార్లు పఠించాలి. ((శ్రమ, కాలం, ధనం వ్యర్థం కాకుండా ఉండటానికి, అవసరానికి డబ్బు సమకూరడానికీ, రావలసిన బాకీ వసూలుకీ ఈ మంత్రం పఠించడం చాలా అవసరం.)

కుంభరాశి వారికి గురుడు తృతీయ (3) స్థానంలో సంచరించుట వలన అన్నిటా చికాకులు, అనవసరమైన శ్రమ. సమయానికి డబ్బు అందకపోవటం, అనారోగ్యం,ఉద్యోగ ప్రయత్నాల్లో ఎదురు దెబ్బలు. చేసే పనిలో, వృత్తిలో తీవ్ర అసంతృప్తి. అందరితో వైరం, కలహాలు, పోట్లాటలు.

పరిహారం: 'శ్రీ రాజమాతంగ్యైనమః' (1108సార్లు)
'శ్రీరామ జయరామ జయ జయ రామ (1108సార్లు)
'క్రీం అచ్యుతానంత గోవింద' (1108సార్లు) పఠించటం చాలా మంచిది.

ఆరోగ్యం బాగుండటానికి, పుణ్యబలం పెరిగి, డబ్బు సమకూరి అధికారుల ఆదరణకి పై మూడు శ్లోకాలు పఠించటం అత్యవసరం. అలాగే గురుచరిత్ర పారాయణ చాలా మంచిది.

మీనరాశి వారికి ద్వితీయ గురు సంచారం (2) వల్ల గౌరవ మర్యాదలు పొందుతారు. అనూహ్యంగా డబ్బు కూడా సంపాదిస్తారు. ప్రతి విషయంలో ఊహించిన దానికన్నా అధికంగా లాభాలుంటాయి. మానసిక సంతృప్తి ఉంటుంది. కుటుంబంతో ఆనందంగా గడుపుతారు. ఎప్పుడో చేసిన మంచి పనులకి ఇప్పుడు గుర్తింపు కూడా వస్తుంది.

ఈ రకంగా ద్వాదశ రాశుల యందు గురు గ్రహ సంచారం వలన పుష్కరాల సందర్భంగా (మే 8 నుంచి) మార్పులు సంభవిస్తాయి.

డా॥ ఈడుపుగంటి పద్మజారాణి
జ్యోతిష్య వాస్తు పండితురాలు
శివం రోడ్, హైదరాబాద్. ఫోన్– 8143383814
www.padmajaastro.com

ప్రాచీన కళా వైభవం...

ఛాయా సోమేశ్వర ఆలయం

భారత దేశ చరిత్ర అత్యంత ప్రాచీనమైనదని, మన సంస్కృతి, సంప్రదాయాలు, నిర్మాణాలు, నమ్మకాలు, ఆశయాలు, జీవన శైలి ఎంతో మహోన్నతమైనదని నిరూపించే ఆధారాలెన్నో ఎన్నో ప్రాంతాలలో జరిపిన త్రవ్వకాలలో లభించాయి. అలాంటివి మన రాష్ట్రంలో కూడా చాలా ఉన్నాయి. పవిత్ర కృష్ణానదీ తీరంలో విస్తరించిన నల్లగొండ జిల్లాలో అనేక ప్రాంతాలలో ఈ ఛాయలు కనుపిస్తాయి. ఇక్కడ హిందూ, బౌద్ధ, జైన మతాలు వివిధ కాలాలలో వెల్లివిరిసాయని దొరికిన ఆధారాలు తెలుపుతున్నాయి. ఎన్నో స్థూపాలు, శిల్పాలు వెలుగు చూశాయి. హిందూ ఆలయాలలో మేళ్ళ చెఱువు, మెట్టపల్లి, వాడపల్లి, యాదగిరిల ప్రాశస్త్యం చాలామందికి తెలిసిందే. కానీ ఎంతో చారిత్రిక నేపథ్యం, నిర్మాణ విలువలు ఉన్నా అంతగా ప్రాచుర్యంలోనికి ఒక విశేష ఆలయం ఈ జిల్లాలో ఉంది. అదే శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం. జిల్లా కేంద్రమైన నల్లగొండ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పానగల్లు గ్రామంలోని ఈ ఆలయంలో మరెక్కడా కనుపించని విశేషం ఉన్నది. అక్కడ గర్భాలయంలోని శివలింగాన్ని నిరంతరం నిలువెత్తు ఛాయ కప్పి ఉండటం. ఆలయ చరిత్ర: సుమారు పదో శతాబ్దంలో పానగల్లుని రాజధానిగా చేసుకొని ప్రస్తుత నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలను పాలించిన 'కందూరు చోడులు' తమ ఆరాధ్య దైవమైన పరమేశ్వరునికి నిర్మించిన ఆలయాలలో ఇది ఒకటి. సమీపంలో వీరి కోట తాలూకు శిథిలాలున్నాయి. వీరి తర్వాత ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్న కాకతీయ ప్రభువులు కూడా ఈ ఆలయ అభివృద్ధికి కృషి చేసారనడానికి నిదర్శనం ఇక్కడ లభించిన ప్రతాపరుద్రుని శాసనం.

తదనంతర రాజవంశాలు కూడా తమ వంతు సేవలు, కైంకర్యాలు సమర్పించుకున్నారని తెలుస్తోంది. ఆలయ విశేషాలు: ఊరికి దూరంగా ఒంటరిగా పొలాల మధ్య ఎలాంటి రాజగోపురమూ లేకుండా చతురస్రాకారంలో ఉండే మూడు గర్భాలయాలు గల ఈ త్రికూటాలయంలోని ఒక దాంట్లో శ్రీదత్తాత్రేయుడు కొలువై ఉండగా మరొకటి ఖాళీగా ఉంటుంది. తూర్పు ముఖంగా లోతుగా ఉన్న మూడో గర్భాలయంలో మూలవిరాట్టు శ్రీసోమేశ్వర స్వామి దర్శనమిస్తారు. నిరంతరం నీడతో కప్పబడి ఉన్నందున స్వామిని 'ఛాయా సోమేశ్వరుడు' అంటారు. పూర్తిగా రాతి నిర్మాణం అయిన ఆలయంలో చాళుక్యుల శైలి కొంత కనపడుతుంది. మండప స్థంభాలకు రామాయణ, భారత, శివలీలా ఘట్టాలు చెక్కారు. ద్వారపాలక విగ్రహాలు, గర్భాలయ ద్వారం పైనున్న తోరణానికి చెక్కిన సూక్ష్మరూప లతలు, పూలు ఆలయ బయటి గోడలపై ఉన్న శిల్పాలు మనోహరంగా ఉంటాయి. లింగానికి ఎదురుగా నందీశ్వరుడు లేకున్నా, ద్వారానికిరుపక్కలా విఘ్నరాజు వినాయకుడు, నాగరాజు దర్శనమిస్తారు. ఆలయం ప్రాంగణంలో దాడులలో ధ్వంసం చేయబడిన నందులు, ఇతర శిల్పాలు కనుపించి హృదయాన్ని కలవర పరుస్తాయి. చుట్టూ ఉన్న ఉప ఆలయాలు చాలా వరకు ఖాళీగా ఉండగా, ఒక దాంట్లో మాత్రం 'ఆత్మలింగ' రూపంలో లింగరాజు కొలువై ఉంటాడు.

ఛాయా రహస్యం: లింగం మీద పడే ఛాయ వెనుక ఉన్న రహస్యాన్ని కనుగొనడానికి శాస్త్రవేత్తలు ఎన్నో సంవత్సరాలుగా పరిశోధించి దానిని ఇటీవలనే ఛేదించగలిగారు. ఎంతో శోధన పరిశీలన, పరిశోధన జరిపి ఛాయ రహస్యాన్ని కనుగొన్నది జిల్లా వాసి, భౌతిక శాస్త్ర అధ్యాపకులు అయిన మనోహర్ దీనిని ఛేదించినట్టు తెలుస్తోంది. అతడి సిద్ధాంతం ప్రకారం ఛాయ వెనుక కీలకమంతా ఇక్కడి స్తంబాల అమరికలో ఉన్నది. వెలుగు పడినప్పుడు ఏర్పడే స్తంబాల నీడ ఒకదాని మీద మరొకటి పడి చివరకు ఒకటిగా మారి లింగం మీద పడుతున్నాయని, అలా పడటానికి కారణమైన సూర్యకాంతి ధారాళంగా ఆలయంలోకి ప్రవేశించడానికి అనువుగా ప్రహరీగోడ నిర్మించలేదని తేల్చారు. అన్ని ఆలయాలలో కనుపించే ధ్వజస్తంబం కూడా ఇక్కడ ఉండదు. నాడు పరిమితంగా ఉన్న పరికరాలు, సదుపాయాలు సహాయంతో ఎంతో కాలం సూర్యగమనాన్ని, కాంతి మార్గాన్ని గమనించి, లెక్క కట్టి దానికి అనుగుణంగా స్తంబాలను అమర్చి ఒక అద్భుతాన్ని మన ముందు ఆవిష్కరించిన శిల్పుల గొప్పదనం ఎంతైనా శ్లాఘనీయం. ఇక్కడ మరో చిత్రమేమిటంటే ఛాయపడే మార్గంలో ఏదైనా వస్తువును ఉంచితే దాని నీడ కూడా పడుతుంది. అదే కొద్దిగా ప్రక్కన ఉంచితే ఆ వస్తువు నీడ పడదు. ప్రస్తుతం పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆలయం లో వారి బోర్డు తప్ప మరే రకమైన నిర్వహణ, అభివృద్ధి, సంరక్షణ, రక్షణలకు సంబంధించిన దాఖలాలు కనుపించకపోవడం, కనీసం దీపం వెలిగించే పూజారి కూడా లేకపోవడం శోచనీయం. తమ ఇష్టదైవ ఆలయం ఒక విశిష్ట నిర్మాణంగా ఉండాలన్న రాజుల ఆకాంక్షను తమ ప్రజ్ఞాపాటవాలతో ఒక రూపాన్ని కల్పించిన శిల్పుల మేధస్సును గుర్తించి, దానిని కాపాడి నేర్చుకోవాలి. మన నిర్మాణాల గొప్పదనాన్ని తెలిపే వారసత్వ కట్టడానికి తగిన రక్షణ, గౌరవం, ఆదరంతో కూడిన పోషణ, ప్రచారం కల్పించకపోవడం విచారకరం. భావి తరాలకు ఈ అద్భుత నిర్మాణాన్ని అందించాల్సిన బాధ్యత ఉన్నది.

– ఇలపావులూరి వెంకటేశ్వర్లు, ఫోన్: 9490866124

రజి అల్లాహుతాలా అన్‌హు హదీసుల కంఠస్థం

హ. అబ్దుల్లా బిన్ అమరిబ్ నిల్ ఆస్ మహా భక్తుడు, గొప్ప నిష్ఠాపరులు. వారి ప్రతి దినము పూర్తిగా ఒక ఖురానే షరీఫ్‌ను చదువే వారు. రాత్రుల యందు నమాజ్‌ల యందు నిమగ్నమై యుండేవారు. పగటి పూట ఉపవాస ముండేవారు. వారి అత్యధిక ప్రార్థనలను గమనించి ప్రవక్త సొల్లల్లాహు అలైహివసల్లమ్ వారిని మందలించి ఇట్లనిరి. ఓ అబ్దుల్లాహ్! అట్లు చేయుట వలన కన్నులలోని కాంతి నశించును. శరీరమునకు గూడ ఒక హక్కు వున్నది. కుటుంబ సభ్యులకు కూడ మనపై హక్కు వున్నది. పైగా మన ఇంటికి వచ్చిపోవు వారి హక్కులు కూడ మనపై ఉన్నవి. అందుకు హజ్రత్ అబ్దుల్లా బిన్ అమరిబ్ నిల్ ఆస్ ఇట్లు తెలిపిరి. నా అలవాటు ప్రతి దినము ఒకమారు ఖురానే మజీదును పూర్తి చేయుట, కాని ప్రవక్త సొల్లల్లాహు అలైహివసల్లమ్, నాకు నెలకు ఒకమారు ఖురాన్‌ను పూర్తి చేయమని ఆదేశించిరి. నేను అప్పుడు ప్రవక్త సొల్లల్లాహు అలైహింసల్లమ్‌తో ఇట్లు విన్నవించితిని. ఓ ప్రవక్తా సొల్లల్లాహు అలైహివసల్లమ్ ! నాకు యవ్వనములో గల బలముతో లాభము పొందుటకు అవకాశము కలిగించండి.

ప్రవక్త సొ॥ గారు: మంచిది 20 రోజులలో ఒక ఖురానే మజీద్ చదువుము.

నేను : అయ్యా. ఇది చాలా తక్కువ. నా యవ్వన బలముతో నన్ను లాభము పొందనివ్వండి. అట్లు నాకు అనుమతి ప్రసాదించండి.

నేను పలుమార్లు ఇదే విధముగా విన్నవించుచుంటిని. చివరకు మూడు దినములకు ఒక ఖురానును పూర్తి చేయుటకు గాను నాకు అనుమతిని ప్రసాదించిరి. హ. అబ్దుల్లాహ్‌కి ప్రవక్త సొల్లల్లాహు అలైహివసల్లమ్ హదీసులను వ్రాసి పెట్టి అలవాటుండినది. ఎందుకనగా అవి జ్ఞాపకము వుండవలయునని వారి ఆశయము. అందువలన వారి వద్ద హదీసులు జమచేసిన ఒక గ్రంథము వుండినది. ప్రవక్త సొల్లల్లాహు అలైహివసల్లమ్ హదీసులన్నియు అందులో వ్రాయబడి యుండెను. ఆ గ్రంథమునకు వారు సొదిఖా అని పేరు పెట్టి యుండిరి. వారిట్లు తెలియజేసి యున్నారు.

నేను ప్రవక్త సొల్లల్లాహు అలైహివసల్లమ్ నుంచి విన్నదంతయు జ్ఞాపకము వుండవలెనని ఉద్దేశముతో వాటిని వ్రాసిపెట్టేవాడను. అయితే కొందరు నన్ను వారించిరి. ప్రవక్త సొల్లల్లాహు అలైహివసల్లమ్ గారు గూడ చివరకు మానవులే గదా! ఒక్కొక్కమారు కోపముతోగాని సంతోషముతోను, లేదా విరోదార్థముగాను, లేదా పరిహాసముగా, లేదా ప్రసన్నము చెందినపుడు కొన్ని మాటలు పలుకుదురు. ప్రతి విషయమును వ్రాసి పెట్టకుము అని నాకు భయపెట్టిరి. వీరి మాటలు విని నేను హదీసులను వ్రాయుట మానితిని. ఒకమారు ప్రవక్త సొల్లల్లాహు అలైహివసల్లమ్‌తో ఆ విషయ మును నేను తెలుపగా, ఆయన తప్పక వ్రాయమని ఆజ్ఞ ఇచ్చిరి. ఆ పవిత్ర అల్లాహ్‌పై ఒట్టు, ఎవరి వశములో నా ప్రాణమున్నదో అతని సాక్షి! ఆ పవిత్ర ప్రవక్త సొల్లల్లాహు అలైహివసల్లమ్ నోటి నుండి కోపములో గానిమ్ము సంతోషములో గానిమ్ము, సత్యము దప్ప మరి ఏమియును రాదు.

అమావాస్య మంచిరోజు కాదా?

మహాభారత యుద్ధాన్ని పాండవులు అమావాస్యనాడే ప్రారంభించారు. విజయాన్ని సాధించారు. అధర్మాన్ని ఓడించి, ధర్మాన్ని గెలిపించిన ముహూర్తమిది. కొన్ని రాష్ట్రాల్లో అమావాస్య మంచిరోజు. వేచి ఉండి మరీ పనులు ప్రారంభిస్తారు. శుభకార్యాలు జరుపుకుంటారు.

రాతి మీద రాయి ఉండదు

ఏసు ప్రభువు బోధించి దేవాలయములో నుండి బయటికి వెడుతుండగా ఆయన శిష్యులలో ఒకడు యెరూషలేము దేవాలయము యొక్క ఔన్నత్యాన్ని పొగుడుతుండ గా ఏసు ప్రభువు ఎరూషలేము పట్టణము, దేవాలయమును రాయి మీద రాయి లేకుండా పడద్రోయబడునని ప్రవచించాడు. ఆయన మాటలు విన్న శిష్యులు విభ్రాంతి చెందారు.

మొదటి దేవాలయము క్రీస్తుకు పూర్వము సొలెమోను మహారాజు కట్టించింది. క్రీ॥పూ॥586లో నాశనం చేయబడింది. ఆ తర్వాత జెరుబ్బాబెలు నాయకత్వాన హగ్గయి, జకర్యా ప్రోత్సాహంతో క్రీ॥పూ॥ 516లో పూర్తి చేయబడింది. ఆ తర్వాత హేరోదు మహారాజు పాలనలో ఈ దేవాలయం అతి సౌందర్యంగా అధునాతనంగా క్రీ॥పూ॥20లో ప్రారంభించి క్రీ॥శ॥64లో పూర్తి చేయబడింది. ప్రభువు శరీరధారిగా జీవించిన కాలంలో కూడా ఇది సంపూర్తి చేయబడలేదు. అందుకే యోహాను 2:20లో యూదులు – 'ఈ దేవాలయం నలువది ఆరు సంవత్సరములు కట్టిరే; నీవు మూడు దినములలో దానిని లేపుదువా' అనిరి. అయితే ప్రభువు దేహమును దేవాలయమును గూర్చి చెప్పియుండెను. ప్రభువు ప్రవచించినట్టు క్రీ॥శ॥ 70లో టైటస్ రోమా సైనికాధికారి నాయకత్వములో రాతి మీద రాయి లేకుండా సమూల నాశనము చేయబడింది. ఈనాటికి కూడా ఆ శిథిలాలను చూచి ఖచ్చితంగా ఆ దేవాలయం ఎక్కడ ఉండిందో చెప్పడం కష్టం. ఆ రాళ్ళను, కట్టడాలను చూసి మురిసిపోతున్న యూదులకు అది నాశనమగునని చెప్పడం బాధాకరమే గాని యథార్థమైంది.

రాళ్ళను, కట్టడాలను చూసి మురిసిపోవుటకన్నా సజీవంగా ఆత్మమందిరంగా శాశ్వతంగా ఉండిపోయే దానిలో భాగంగా ఉండుట మహాభాగ్యము. సజీవరాయి అందులో అమర్చటం ఎంతో శ్రేష్ఠము.

ప్రార్థన: 'యేసు ప్రభూ! పడద్రోయబడే రాళ్ళలో ఒకటిగా ఉండకుండ కాపాడుము'

– రెవ॥డా॥ జి.సామ్యేల్, సీనియర్ పాస్టర్